మిర్చిలో మల్చింగ్

- సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు
- జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి


7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట 5

శుక్రవారం 7 మార్చి 2025





సంధ్యా సమయాన అరుణ తిలకం

సిద్దిపేట కోమటిచెరువు భానుడి నులివెచ్చని కిరణాలతో కొత్త అందాలను సంతరించుకుంది. ఈ దృశ్యం స్థానికులకు, సందర్శకులకు ఎంతో ఆహ్లాదం కలిగించింది. దీంతో వారు సంధ్యా సమయాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అలంకారప్రాయంగా టీ ఫైబర్

- పంచాయతీల్లో అందుబాటులోకి రాని ఇంటర్‌నెట్ సేవలు
- కేబుల్ వేసి, పరికరాలు బిగించి కనెక్షన్ ఇవ్వని సిబ్బంది

సిద్దిపేట కలెక్టరేట్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రజలకు ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు. పంచాయతీలకు ఉచిత వైఫై సేవలు అందించేందుకు గత ప్రభుత్వం టీ ఫైబర్ పనులను చేపట్టింది. జిల్లాలోని 499 గ్రామపంచాయతీల్లో టీ ఫైబర్ పనులు దాదాపు పూర్తికాగా మారుమూల ప్రాంతాల్లో కొన్నిచోట్ల కేబుల్ బ్లోయింగ్ పనులు పూర్తి కావాల్సి ఉంది. పంచాయతీ కార్యాలయాల్లో సదుపాయం కోసం అవసరమైన సర్వర్ ప్యానల్ బాక్సులు, యూపీఎస్, కనెక్షన్ రూటర్ స్విచ్, ఎఫ్‌బీఎంఎస్, ర్యాక్‌లు ఏర్పాటు చేశారు..

విద్యుత్తు అంతరాయం లేకుండా సోలార్ ప్యానల్

టీ ఫైబర్ సేవలకు అవసరమైన విద్యుత్ కోసం మీటర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం కలగకుండా సోలార్ ప్యానల్ బ్యాటరీలను అమర్చి విద్యుత్ వసతి కల్పించి నెట్‌వర్క్ అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి కంట్రోల్ రూంలను ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా మూడేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన వైఫై కనెక్షన్‌ను నేటికీ పంచాయతీలకు అనుసంధానం చేయలేదు. గ్రామాల్లో ఈ పంచాయతీ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రతీ పనికి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుందని కార్యదర్శులు వాపోతున్నారు. వెంటనే గ్రామాల్లోకి టీ ఫైబర్ సేవలు అందుబాటులోకి తేవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా టీ ఫైబర్ మేనేజర్ వినోద్ కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. టెస్టింగ్ కోసం కంప్యూటర్లున్న గిన పలు గ్రామపంచాయతీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని, ప్రభుత్వ అనుమతి రాగానే అన్ని గ్రామ పంచాయతీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.



జిల్లాలోని ఓ గ్రామపంచాయతీలో అలంకారప్రాయంగా టీ ఫైబర్ వైఫై ప్యానల్ బాక్సులు



రెండోరోజు 97% హాజరు

- ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం

సిద్దిపేట క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఉన్న 43 కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 9,452 మంది విద్యార్థులకుగాను 9,117 మంది హాజరయ్యారు. 97 శాతం హాజరు నమోదైంది. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఉజ్వల జూనియర్ కాలేజ్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ సందర్శించారు.

పగలు ఎండ.. రాత్రి చలి!

- ఉమ్మడి మెదక్ జిల్లాలో భిన్నమైన వాతావరణం
- గరిష్ఠం 37.3 డిగ్రీలు, కనిష్ఠం 9.9 డిగ్రీలుగా నమోదు

మెదక్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు భిన్నంగా నమోదవుతున్నాయి. రాత్రిపూట చలి వణికిస్తుండగా.. పగలు ఎండ సుర్రుమంటున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగలు గరిష్ఠ ఉష్ణోగ్రత 37.3 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రత 9.9 డిగ్రీలకు దిగువగా నమోదవుతున్నాయి.

ఉష్ణోగ్రతలు ఇలా...

సంగారెడ్డి జిల్లా అల్మాయిపేటలో 9.9 డిగ్రీలు, నల్లవల్లి 10.0, కోహీర్ 10..8, జిన్నారం 11.1, లక్ష్మీసాగర్ 11.2, అన్నాసాగర్ 11.3, హత్నూర 11.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా గుండ్లమాచనూర్‌లో 35.4 డిగ్రీలు, కల్హేర్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోత్రలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లా నంగునూర్‌లో 10.4, పోతారెడ్డిపేట 10.5, మిరుదొడ్డి 10.7, కొండపాక 10.9, హబ్సీపూర్ 11.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా సిద్దిపేట 36, పోతారెడ్డిపేట 35.9, కట్కూర్ 35.7, తుక్కాపూర్ 35.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా బోడగాట్‌లో 11 డిగ్రీలు, దామరంచ 11.2, వెల్దుర్తి 11.4, పెద్దశంకరంపేట 11.6, నాగాపూర్ 11.8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదేసమయంలో కొల్చారంలో 37.3, టేక్మాల్ 36.6, దామరంచ 36.3, కాగజ్‌మాద్దూర్ 35.7, చిన్నశంకరంపేట 35.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇక కొత్త లెక్క..

- 'నామినేటెడ్' ప్రతిపాదనలు రద్దు?
- మీనాక్షి నటరాజన్ ఎదుట ఫిర్యాదుల వెల్లువ
- దుబ్బాక, సిద్దిపేటపై కాంగ్రెస్ అధిష్ఠానం నజర్
- ముందు నుంచి ఉన్న కార్యకర్తలకే ప్రాధాన్యం
- మంత్రి దామోదర్‌కు జిల్లా బాధ్యతలు
- పార్టీ మారిన నేతల ఆశలపై నీళ్లు!!



దుబ్బాక, మార్చి6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో ప్రక్షాళన పర్వం మొదలైంది. రెండు రోజుల క్రితం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో జరిగిన సమీక్షలో నామినేటెడ్ పదవుల కోసం పంపిన ప్రతిపాదలు బుట్టదాఖలయ్యాయి. దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాలకు చెందిన నామినేటెడ్ పోస్టుల వ్యవహారాన్ని మంత్రి రాజనర్సింహకు అప్పగించారు. పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఎదుట సీనియర్ నాయకులు తమ మొరను వినిపించడంతో దుబ్బాక వ్యవహారంపై పూర్తిగా తేలిన తర్వాతే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని మీనాక్షి ఆదేశించినట్లు సమాచారం. దుబ్బాక, మిరుదొడ్డి, చేగుంట, దౌల్తాబాద్, తొగుట మండలాల మార్కెట్ కమిటీలకు ఈపాటికే ప్రతిపాదించిన పేర్లపై అధిష్ఠానం పూర్తిగా విచారించనున్నట్టు తెలిసింది. కూడవెళ్లి రామలింగేశ్వరాలయ ఆలయ పాలకమండలి నియామకం ఏర్పాటు కూడామీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదులు అందాయి.

పార్టీ మారిన వారికి పదవులా..?

పదేళ్లుగా పార్టీని నమ్ముకుని ఉంటున్న వారికే ప్రాధాన్యం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రకటించడంతో మొదట తొగుట మార్కెట్ కమిటీ పాలక మండలికి ప్రతిపాదించిన పేర్ల ప్రస్తావన ప్రధానంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు చెరుకు అమరేందర్‌రెడ్డి(విజయ్) పేరును తొగుట మార్కెట్ కమిటీకి ప్రతిపాదించారు. 2018లో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరి, తిరిగి కాంగ్రెస్ గూటికి వచ్చారు. పదేళ్లుగా తాము పార్టీని నమ్ముకుని ఉన్నామని తమకు గుర్తింపు లేదంటూ కొందరు సీనియర్లు ప్రశ్నించారు. చేగుంటలో ఓ నేత బీఆర్‌ఎస్ నుంచి బీజేపీకి, ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చాడని, పార్టీలు మారిన అతనికి పదవి ఇచ్చారంటూ ఫిర్యాదు చేశారు. దుబ్బాకలో కూడా ప్రతిపాదిత వ్యక్తులు పార్టీలు మారి వచ్చిన వారేనని, తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. మిరుదొడ్డి మండలంలో కూడా కార్యకర్తలను కాదని నాయకులకు చెందిన బంధువుల పేర్లను ప్రతిపాదించారని ఆరోపించారు. మిరుదొడ్డి మండలం మార్కెట్ కమిటీలో కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని, సీనియర్లను కాదని.. పార్టీకి ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తి పేరు ప్రతిపాదించారని నాయకులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మద్దుల గాల్‌రెడ్డివర్గం ఫిర్యాదు చేశారు. దౌల్తాబాద్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కర్నాల శ్రీనివాస్ కూడా పదవి ఆశిస్తుండగా అక్కడ కూడా అసమ్మతి నెలకొన్నది. దుబ్బాక మార్కెట్ కమిటీ వ్యవహారంలో ఏకంగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వర్గంలోనే రెండు వర్గాలుగా విడిపోయారు. పార్టీలోని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులుగా పేరున్న మచ్చ శ్రీనివాస్‌రెడ్డి వర్గం, కొంగరి రవివర్గం, ఏసురెడ్డి వర్గాలు విడిపోయాయి. వీరికి తోడుగా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మద్దుల సోమేశ్వర్‌రెడ్డి గ్రూపులు సాగిస్తున్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ వ్యవహారం కూడా కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. ఆత్మ కమిటీ చైర్మన్‌గా ప్రతిపాదించిన మాజీ సర్పంచ్ రాంపూర్ భాస్కర్

మిగతా 8వ పేజీలో

మంత్రి దామోదర్‌కు బాధ్యతలు

దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గంలోని పార్టీ వ్యవహారాలను చక్కపెట్టడానికి మంత్రి దామోదర్ రాజనర్సింహకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ప్రతిపాదిత పేర్లను పరిశీలించి, పదేళ్ల నుంచి పార్టీని వదలకుండా పని చేసే కార్యకర్తలను మాత్రమే పరిగణలోకి తీసుకోనున్నారు. ఇందుకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా దామోదర్ రాజనర్సింహకు పూర్తి బాధ్యతలను అప్పగించారు. రెండు రోజుల్లోనే దుబ్బాక, సిద్దిపేట నియోజక వర్గాల వ్యవహారాలపై నివేదిక కూడా అందించాలని సూచించనట్టు తెలిసింది. దీంతో దుబ్బాక నియోజకవర్గంలో పార్టీలు మారిన నేతల ఆశలపై ఓ రకంగా అధిష్ఠానం నీళ్లు చల్లినట్లయింది.!

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై
అవగాహన కల్పించాలి

- సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో చదివే పిల్లలకు గుడ్‌టచ్.. బ్యాడ్ టచ్ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సీపీ అనురాధ షీటీం, భరోసా, స్నేహిత సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె పోలీస్ కమిషనర్ కార్యాలయంలో షీటీమ్, భరోసా స్నేహిత సిబ్బందితో మహిళల పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లినపుడు వారి మానసిక పరిస్థితిని అంచనా వేసి వారికి అర్థమయ్యేలా మాట్లాడి బాగోగులు తెలుసుకోవాలని సూచించారు. ఈవ్‌టీజింగ్ జరిగే హాట్‌స్పాట్ల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రతిరోజూ స్కూళ్లలో, కాలేజీల్లో తదితర ప్రాంతాల్లో మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, మూడు డివిజన్ల షీటీమ్ సిబ్బంది, సిద్దిపేట భరోసా సెంటర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేట పీఎఫ్ ఆఫీస్‌ను
తరలించొద్దు

సిద్దిపేట క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పీఎఫ్ ఆఫీస్‌ను తరలించొద్దని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ జోనల్ ఆఫీస్ ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్రమంత్రి మన్సుఖ్‌కు ఎంపీ విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన సిద్దిపేట పీఎఫ్ ఆఫీస్‌ని తరలించొద్దని పీఎఫ్ కమిషనర్ రమేష్‌కృష్ణ మూర్తికి ఆదేశాలు జారీ చేశారు.

ఎట్టకేలకు 'డబుల్' ఇళ్ల పనులు షురూ..

- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ
- పట్టాలు ఇచ్చిన రెండేళ్లకు పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

హుస్నాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పెండింగ్ పనులకు మోక్షం లభించింది. ఎట్టకేలకు గురువారం నుంచి వీటి పనులు మొదలయ్యాయి. దాదాపు రెండేళ్ల తర్వాత పనులు ప్రారంభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకుండానే లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు ఇచ్చారు. ఇందులో పలువురికి కేటాయించిన ఇళ్లు పూర్తికాకపోవడంతో నివసించేందుకు అనుకూలంగా లేవని, నిర్మాణాలు పూర్తిచేయాలని రెండేళ్లుగా లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరిగారు. మొదటి విడత 160, రెండో విడతలో 400 ఇళ్లు మంజూరయ్యాయి. మొత్తం 560 ఇళ్లకు జీప్లస్ 2 పద్ధతిలో నాగారం రోడ్డులో 2017 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి వీటి పనులు ఆగుతూ సాగుతూ వచ్చాయి.



అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

96 ఇళ్ల పనులు..

పట్టణానికి 560 ఇళ్లు మంజూరైనప్పటికీ వివిధ కారణాలతో 288 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు జరిగాయి. ఇవి కూడా వివిధ దశల్లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు 2023 ఫిబ్రవరిలో డ్రా తీసి 264 మంది లబ్ధిదారులకు కేటాయించారు. ఇందులో 168 ఇళ్లు మొత్తం పూర్తయ్యాయి. 96 ఇళ్లు 80 శాతం మాత్రమే పూర్తయ్యాయి. వాటికి కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడం వల్లే పనులను పూర్తిచేయలేదు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపి సంబంధిత అధికారులతో మాట్లాడి లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇటీవల పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతో గురువారం నుంచి పనులు ప్రారంభించారు. ఎట్టకేలకు 96 ఇళ్ల పనులు ప్రారంభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొనసాగుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు

'పది'ంతలు చదువుదాం

- తడబాటు.. ఒత్తిడి అస్సలు వద్దు

కొండపాక, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి.. విద్యార్థి జీవితానికి పునాది వంటిది. ఇక్కడి నుంచే వారి ఉన్నత చదువులకు అడుగు పడుతుంది. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు పదో తరగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. మంచి మార్కులు లక్ష్యంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఏడాదంతా చదివినా పరీక్షలంటే విద్యార్థులకు భయం. తడబాటు.. ఒత్తిడి లేకుండా చదివితే పదింతలు నేర్చుకునే అవకాశం ఉంది. ఇందుకు ప్రణాళికతో పాటు ప్రోత్సాహం అవసరం. ఈ నెల 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సబ్జెక్ట్ నిపుణల అభిప్రాయాలు...

7లో



రూ.14లక్షల జీఎస్టీ సొమ్ము ఎగవేత

- ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు అందజేసిన మల్లన్న ఆలయాధికారులు

చేర్యాల, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయాధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిన జీఎస్టీ సొమ్ము రూ.14లక్షల మేర చెల్లించకుండా పక్కదోవ పట్టించిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీపై చర్యల నిమిత్తం షోకాజ్ నోటీసు జారీ చేశారు.

హైదరాబాద్‌కు చెందిన హిమాన్స్ సీఆర్‌ఎం ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మల్లన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 30 మంది పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికీ వేతనం కింద రూ.15 వేల నుంచి రూ.26వేల వరకు ప్రతీనెలా సుమారు రూ.6లక్షలు చెల్లిస్తున్నారు. అందుకుగాను ఏజెన్సీ నిర్వహకుడు ప్రభుత్వానికి ప్రతినెలా 18శాతం జీఎస్టీ చెల్లించాలి. కానీ జూలై 1-2023 నుంచి డిసెంబరు-31, 2024వరకు 18నెలల జీఎస్టీ సొమ్మును దేవాలయాధికారులు ఏజెన్సీ నిర్వహకుడికి రూ.16,51,637 చెల్లించారు. కానీ అతను మాత్రం కేవలం రూ.2,40,346 చెల్లించాడు. మిగతా రూ.14,11,291 జీఎస్టీ డబ్బు చెల్లించకపోవడంతో దేవాలయాధికారులు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి గత నవంబరు, డిసెంబరు, జనవరి వేతనాలు చెల్లించకుండా నిలిపివేశారు. సిబ్బంది ఒత్తిడి తీసుకురావడంతో ఏజెన్సీ నిర్వహకుడు దిగొచ్చి ఫిబ్రవరిలో ఆలయాధికారులతో సంప్రదించి అర్థాంతరంగా కార్యాలయం నుంచి వెళ్లిపోయాడు. నేటికీ జీఎస్టీ సొమ్ము ఖజానాకు జమచేయకపోగా, ఆలయానికైనా చెల్లించడం లేదు. దీంతో సిబ్బందికి ఫిబ్రవరి వేతనం ఆపేయడతో వారు ఆందోళన చెందుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు సదరు ఏజెన్సీకి ఆలయాధికారులు షోకాజ్ నోటీసులు అందించారు. 15రోజుల్లో రూ. రూ.14.11 లక్షలు చెల్లించకుంటే లేబర్ యాక్ట్‌తో పాటు జీఎస్టీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని సూచించారు. ఈ విషయాన్ని జీఎస్టీ కమిషనర్, సిద్దిపేట కలెక్టర్‌కు సమాచారం అందించారు.

రేషన్ దుకాణాల్లో
కాంటాల తనిఖీ

మద్దూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల పరిధిలోని రేషన్ దుకాణాల్లో కాంటాలను ఈ పాసు మిషన్ కోఆర్డినేటర్ సాగర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో ఎలాంటి తేడాలు రాకుండా ఉండేందుకు కాంటాలను తనిఖీ చేసి సరిచేసినట్లు తెలిపారు. బ్యాటరీతోపాటు సాంకేతిక సమస్యలను పరిశీలించామన్నారు. నాణ్యత లేని మిషన్లతో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని, వెంటనే ఫొనిక్స్ కాంటాలు అందించాలని రేషన్ డీలర్లు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు కరీం, కిరణ్, భూపతిరెడ్డి, మంజుల, బాలమణి, కనకలక్ష్మి, హిలోర్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ప్రయోజనం



డీడీఎస్‌-కేవీకేలో తయారుచేసిన సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్‌, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ వ్యవసాయంతోనే ప్రయోజనం ఉంటుందని డీడీఎస్‌-కేవీకే సీనియర్‌ శాస్త్రవేత్త,హెడ్‌ డా. వర ప్రసాద్‌, తదితరులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దిడిగి శివారులో గల డీడీఎస్‌-కేవీకే(డెక్కన్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్రం)లో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు, యువతకు తేనెటీగల పెంపకం, వర్మీ కంపోస్టు, శాస్త్రీయ పద్ధతుల్లో నారు, మేకల, పశువుల, మట్టి పరీక్షలు చేసే పద్ధతులు, జీవన ఎరువులు, సేంద్రియ వ్యవసాయం, ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలజ,స్నేహలత, రమేష్‌, హేమలత, సాయిప్రియాంక, కైలాష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్‌

సంగారెడ్డి టౌన్‌, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నేడు సంగారెడ్డి పట్టణంలోని చాణక్యపురి 2,300 కేఎల్‌ సామర్థ్యం గల ఓహెచ్‌ఎస్‌ఆర్‌ ట్యాంకు పరిధిలోని పలు కాలనీలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నామని మునిసిపల్‌ కమిషనర్‌ ప్రసాద్‌చౌహాన్‌ తెలిపారు. ఓహెచ్‌ఎస్‌ఆర్‌ ట్యాంకును శుభ్రం చేసే పనులు చేపడుతున్నందున ఆయా కాలనీలకు నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలకు అత్యవసరంగా తాగునీటిని మునిసిపల్‌ ట్యాంకర్లు, పవర్‌ బోర్ల ద్వారా అందజేస్తామని చెప్పారు. శుభ్రం చేసే పనులు పూర్తయిన వెంటనే యధావిధిగా తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన



మాల్యాతండాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

శివ్వంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోజులుగా మిషన్‌ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ మల్యాతండాలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బోజ్యతండా పంచాయతీ పరిధిలోని మాల్యాతండాలో నాలుగురోజులుగా మిషన్‌ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి వేసవిలో తాగునీటికి ఇబ్బందిపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. పంట పొలాల నుంచి కూడా నీటిని తీసుకుపోనివ్వడం లేదని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మహిళలు డిమాండ్‌ చేశారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌ అవార్డుకు విద్యార్థులు

చిన్నశంకరంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని సూరారం, శాలిపేట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తక్కడ సంధ్య, రావణబోయిన నవనీత, 7వ తరగతి చదువుతున్న బోండ్ల సంపత్‌ కుమార్‌, అలాగే నార్సింగి మండలం శేరిపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన కట్ట ప్రవళిక తయారుచేసిన సైన్స్‌ నమూనాలు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌ 2024-25 అవార్డుకు ఎంపికయ్యాయని ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, తౌడ తిరుపతి తెలిపారు.

అల్గోల్‌లో వ్యక్తి అదృశ్యం



రాజు(ఫైల్‌)

జహీరాబాద్‌, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని అల్గోల్‌ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన ఎరుపుల రాజు(30) ఈ నెల 2న ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య పద్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కాశీనాథ్‌ వివరించారు.

మద్యం ఇవ్వలేదని కిరాణషాపు యజమానిపై దాడి

హవేళీఘణపూర్‌, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం ఇవ్వలేదని కిరాణ షాపు యజమానిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన హవేళీఘణపూర్‌ మండలం సర్దన గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బంగారయ్య కిరాణషాపు నడుపుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కుర్మ బీరయ్య బుధవారం అర్ధరాత్రి బంగారయ్య ఇంటి తలుపులు కొట్టాడు. చీకటిలో ఎవరూ కనిపించకపోవడంతో తలుపులు వేసుకొని ఇంట్లోకి వెళ్లగా బీరయ్య కనిపించాడు. ఇంట్లోకి ఎందుకు వచ్చావని బీరయ్యను అడగ్గా.. మద్యం కావాలన్నాడు. లేదు.. ఇంట్లోంచి వెళ్లమనగా.. బీరయ్య సీసా ముక్కతో బంగారయ్యపై దాడి చేయగా.. మెడభాగంలో తీవ్రగాయాలయ్యాయి. సమీప ప్రజలను పిలవగా.. బంగారయ్యను 108 అంబులెన్స్‌లో మెదక్‌ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

గజ్వేల్‌ రూరల్‌, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కుంటలో జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. గజ్వేల్‌ మండలం సంగుపల్లి గ్రామానికి చెందిన బడె యాదగిరి (43) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3న ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన యాదగిరి ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం మధ్యాహ్నం పాతకుంటలో శవమై కనిపించాడు. మృతదేహాన్ని గజ్వేల్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుమ్మడిదల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని ఎర్ర చెరువులో గురువారం ఓ వ్యక్తి మృతదేహం ఉన్నదని గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకుతీశారు. మృతుడికి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. గ్రామస్థుడు ఆనంద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా, ఆరుగురికి గాయాలు

నిజాంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పి ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. రామాయంపేట మండలం క్యాటియాల గ్రామానికి చెందిన రాగి రాజయ్య కూతురు పెళ్లిచూపులకు (ఏపీ 23 టీప 2219) నంబరు గల ఆటోలో దుబ్బాకకు వెళ్లి తిరిగి వస్తున్నారు. నిజాంపేట పెట్రోల్‌ బంక్‌ వద్ద వాహనం అడ్డురాగా.. తప్పించబోయి ఆటో పెట్రోల్‌ బంక్‌లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఆటోలో ఉన్న రాజయ్య బంధువుల్లో ఒకరికి తీవ్ర, ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమందించగా.. హుటాహుటిన రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దాడి కేసులో నిందితుడికి నెల జైలు


జోగిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సొంత కుటుంబీకురాలైన మహిళపై చేయిచేసుకున్న కేసులో నిందితుడికి ఒకనెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ... జోగిపేట మున్సిఫ్‌ కోర్టు మెజిస్ట్రేట్‌ ధనలక్ష్మి తీర్పునిచ్చారు. 2014లో జరిగిన ఒక కేసులో... జోగిపేటకు చెందిన డాకూరి కుమార్‌ సొంత బంధువైన మహిళపై దాడిచేశాడు. నేరం రుజువైనందున సదరు నిందితుడు కుమార్‌కు జైలు శిక్షతోపాటు, రూ.1000 జరిమానా విధిస్తూ ఆమె తీర్పునిచ్చారు.

'పది'ంతలు చదువుదాం

తడబాటు.. ఒత్తిడి అస్సలు వద్దు

పదో తరగతి పరీక్షలంటే ఏ మాత్రం భయం వద్దని అంటున్నారు ఉపాధ్యాయులు. పక్కా ప్లానింగ్‌తో చదివితే విజయం మీదే అంటున్నారు. కొంచెం కష్టపడితే ఎక్కువ మార్కులు సాధించవచ్చునంటున్నారు. పరీక్షలంటే భయం లేకుండా ఎలా రాయాలో వారి మాటల్లోనే..

-(కొండపాక, ఆంధ్రజ్యోతి)



భాషా దోషాలు నివారించాలి



తెలుగు పరీక్షలో చేతిరాత అందంగా ఉండేటట్లు చూసుకోవాలి. అక్షరదోషాలు, భాషాదోషాలు దొర్లితే మార్కులు తగ్గించే అవకాశం ఉంది. పార్ట్-ఏలో రెండు విభాగాలు ఉంటాయి. అవగాహన-ప్రతిస్పందనకు చెందిన మొదటి విభాగంలో అపరిచిత గద్యాన్ని ఇస్తారు. అవగాహన చేసుకుని సమాధానాలు రాయాలి. పతిపదార్థాలపై పట్టు పెంచుకోవాలి. పది మార్కుల పేరాగ్రాఫ్ కూడా మార్కుల సాధనలో కీలకమే. రెండవ విభాగంలో వ్యక్తీకరణ-సృజనాత్మకతకు సంబంధించి ఒక ప్రశ్న పాఠ్యభాగ రచయిత లేదా కవి పరిచయం గురించి ఉంటుంది. గద్య, పద్యభాగాలు, ఉపవాచకం నుంచి ప్రశ్నలు వస్తాయి. అభినందన పత్రం, లేఖ, ముఖాముఖీ, సంభాషణ, కవితలలో ఏదైనా ఒకటి రాయమంటారు. సొంతవాక్యాలు, కర్తరీ, కర్మణీ వాక్యాలు, సామాన్య, సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, చందస్సులో గణ విభజన, పద్య గణాలు, యతిస్థానాలు, అక్షరాల సంఖ్య గుర్తించడం వంటి ప్రశ్నలుంటాయి. ప్రకృతి వికృతులు, నానార్థాలు, పర్యాయపదాలు అడుగుతారు. ఇందుకోసం పదజాలంపై పట్టు పెంచుకోవాలి.

- ఆదిరాల సాయినాథ శర్మ, స్కూల్ అసిస్టెంట్, తెలుగు

సమస్యల సాధనపై దృష్టి పెట్టాలి..



గణితంలోని చాప్టర్లలోని అంశాలను అవగాహన చేసుకుని సమాధానాలు రాస్తే ఎక్కువ మార్కులు పొందుతారు. సమస్యలను సాధించేటప్పుడు దత్తాంశాన్ని గుర్తించి తగిన సూత్రాన్ని రాసి సమస్య సాధనలో ఉపయోగించాలి. కరణీయ సంఖ్యలను నిరూపించాలి. అంతమయ్యే, అంతం కానట్టి ఆవర్తితమయ్యే అకరణీయ సంఖ్యలను దశాంశ రూపంలో రాయగలగాలి. సంవర్గమాన విలువలు, సంవర్గమాన విస్తరణల లెక్కలు ప్రాక్టీస్ చేయాలి. సమితులలో సమ్మేళనం, ఛేదనం, భేదం, వెన్ చిత్రాలు, కార్డినల్ సంఖ్యలపై సమస్యలను సాధన చేయాలి. ఇచ్చిన సమితికి ఉపసమితులను రాయడం నేర్చుకోవాలి. రేఖీయ సమీకరణాలకు సంబంధించి రెండు వేరు వేరు చరరాశులలో ఒకదాని ఎన్నుకొని వాటి గుణకాలను సమాన చేయాలి. ఇలా చేసిన తర్వాత ఆ సమీకరణాలను కూడడం లేదా తీసివేయడం ద్వారా రేఖీయ సమీకరణాలను రాశి తొలగింపు పద్ధతిలో సాధించవచ్చు. చరరాశుల గుణకాల నిష్పత్తులను కనుగొని అవి ఖండించే లేదా సమాంతర లేదా ఏకీభవించే రేఖలా అనే విషయాన్ని గుర్తించి 'కె' విలువను సులభంగా తెలుసుకోవచ్చు. వర్గ సమీకరణాల సమస్యలను సాధించాలి. రేఖీయ, వర్గ సమీకరణాలను, బహుపదులను గ్రాఫ్ ద్వారా సాధించడం ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్ లెక్కలలో స్కేలును రాయడం మర్చిపోవద్దు. స్కేలును రాయడం మర్చిపోతే మార్కులు తగ్గిస్తారు. శ్రేడులపై పట్టు సాధించాలి. ఇచ్చిన త్రిభుజానికి దత్త నిష్పత్తిలో సరూప త్రిభుజ నిర్మాణాన్ని, స్పర్శరేఖల నిర్మాణాన్ని ప్రాక్టీస్ చేయాలి. నిర్మాణాలకు సంబంధించిన సమస్యలకు సమాధానం రాసేటప్పుడు ముందుగా చిత్తుపటాన్ని గీయాలి. తరువాత ఇచ్చిన కొలతలకు సరిపోయే విధంగా నిర్మాణాన్ని గీసి సోపానాలను వరుస క్రమంలో రాయాలి. ప్రాథమిక అనుపాత సిద్ధాంతం, పైథాగరస్ సిద్ధాంతం అనువర్తనాలకు సంబంధించిన సమస్యలను సాధనచేయాలి. త్రికోణమితిలో పటాన్ని గీసి ఉర్ధ్వ, నిమ్న కోణాలను గుర్తించి త్రికోణమితి నిష్పత్తుల ద్వారా అనుభవించి ప్రశ్నలను సాధించవచ్చు. త్రికోణమితీయ అనువర్తనాలు అధ్యాయంలోని రెండు అభ్యాసాల్లోని సమస్యలకు చిత్తు పటాలు గీయగలగాలి. సంభావ్యతలో నాణెం ఎగరవేయడం, పాచికను దొర్లించడం వంటి ప్రయోగాలను పర్యవసానాలను నేర్చుకోవాలి. రెండు నాణేలు ఒకేసారి ఎగరవేసినప్పుడు, రెండు పాచికలను ఒకేసారి దొర్లించినప్పుడు ఏర్పడే ప్రతిరూప ఆవరణలను రాయగలగాలి. సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, క్షేత్రమితి లోని సూత్రాలు తెలిసి ఉండాలి. ఆయా అధ్యాయాల లోని సూత్రాలను రాసి, పదాలను వివరించేలా సూత్రాలను నేర్చుకోవాలి. సాంఖ్యక శాస్త్రంలో ఓజీవ్ వక్రం గీసి మధ్యగతం కనుక్కోవాలి.

- కత్తుల లక్ష్మారెడ్డి, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు.

నిత్యజీవిత అనువర్తనాలపై పట్టు పెంచుకోవాలి



భౌతిక రసాయనశాస్త్రంలో అన్ని పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యత ఉంటుంది. పాఠ్య పుస్తకంలో సుమారు 21 నిత్య జీవిత అనువర్తనాలు ఉన్నాయి. వాటిలో కటకాలు, దర్పణాలు, వాటి ఉపయోగాలు, పి హెచ్ విలువ ఉపయోగం, కాంతి పరిక్షేపణం, ఎలక్ట్రికల్ మోటార్ మొదలైనవి చదవాలి. దర్పణాలు, కటాకలలో కిరణ రేఖాచిత్రాలు, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి నివారణ చిత్రాలు, మాయిలర్ చిత్రం, అమ్మోనియా నీటి అణువుల చిత్రాలు సాధన చేయాలి. పి, డి ఆర్బిటాళ్ళ చిత్రాలు ప్రాక్టీస్ చేయాలి. ప్రయోగశాల కృత్యాలలో పుటాకార దర్పణ నాభ్యంతరం, కటకనాభ్యంతరం కనుగొనుట, లోహాలు ఆమ్లంతో చర్య పొందినప్పుడు హైడ్రోజన్ వాయు వెలువడుతుంది అనే ప్రయోగము, ఓం నియమంలో నిరోధాన్ని కనుగొనే ప్రయోగం, తుప్పు పట్టడానికి గాలి నీరు అవసరము అనే ప్రయోగం రావడానికి అవకాశం ఉంది. దర్పణ, కటక సూత్రాలు, ఓం, కిర్కాఫ్ నియమాలు, నిరోధాలలో శ్రేణి, సమాంతర సంధానాలపై లెక్కలు ప్రాక్టీస్ చేయాలి. ఆఫ్ బో నియమం, హుండ్ నియమం, పౌలి వర్జన నియమం, క్వాంటం సంఖ్యలు, ఆధునిక ఆవర్తన పట్టికపై అవగాహన పెంచుకోవాలి. ప్రతి ప్రయోగశాల కృత్యంలో పరికరాల జాబితాను గుర్తు పెట్టుకోవాలి. విద్యుత్ అయస్కాంతత్వంలో ఆంపియర్ కుడిచేతి బొటనవేలు నియమం, ఫారడే నియమం, ఫ్లెమింగ్ ఎడమచేతి నియమాలు ముఖ్యమైనవి. కర్బన సమ్మేళనాలలో ఐయూపీఏసీ నామకరణంపై పాఠ్య పుస్తకంలోని ఉదాహరణలు, ప్రమేయ సమూహాలు గుర్తుంచుకోండి. సంగ్రహణ శాస్త్రంలో ఖనిజాల పేర్లను వాటి సంకేతాలను నేర్చుకోవాలి. ఫ్రాత్ ఫ్లోటేషన్, మాగ్నెటిక్ సెపెరేషన్, రివర్బరోటరీ కొలిమి చదవడం మర్చిపోవద్దు.

-పి.భగవాన్, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు

అన్వయించుకుంటే అ'సామాన్య' ఫలితం



దైనందిన జీవితంలో సైన్సు సూత్రాలను అన్వయించుకుని చదవడం వల్ల విషయంపై పట్టు పెరుగుతుంది. గత ప్రశ్న పత్రాలతో పాటు ప్రయోగ విధానాలను అధ్యయనం చేయాలి. ప్రతి పాఠంలో బొమ్మలను గీయడం సాధన చేయాలి. వాటి భాగాలను సరిగ్గా గుర్తించాలి. పట్టికలను విశ్లేషణ చేయడం నేర్చుకోవాలి. ప్రయోగ విధానాలు, పరికల్పనలు, బొమ్మలు గీయటం, భాగాలు గుర్తించాలి. నిర్వచనాలు, భేదాలు, పోలికలు గుర్తుంచుకొని రాయాలి. పట్టికల సాధనతో అధిక మార్కులు సాధించవచ్చు.

-జీడిపల్లి సురేందర్ రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

హిందీ పాఠ్య పుస్తకం పూర్తిగా చదవాలి



హిందీలో అధిక మార్కులు సాధించాలంటే పాఠ్యపుస్తకం పూర్తిగా చదవాలి. నమూనా ప్రశ్నపత్రాలు సాధన చేయాలి. అక్షర దోషాలు ఉండకుండా చూసుకోవాలి. సమాధానం రాసేటప్పుడు కొట్టివేతలు ఉండకూడదు. చేతిరాత బాగుండాలి. వ్యాకరణ అంశాలను క్షుణ్ణంగా చదువుకోవాలి. మొదటి విభాగంలో ఉపవాచకము నుంచి శాంతికి రహనే, హమ్ సబ్ ఏక్ హై, అప్నే స్కూల్ కో ఏక్ ఉపహార్, అనోఖే ఉపాయ్ పాఠాలు చదవాలి. ఉత్తీర్ణత సాధించేందుకు పేరాగ్రాఫ్ సాధన కీలకంగా ఉంటుంది. పార్ట్-బిలో సమాధానాలను గుర్తించేటప్పుడు కొట్టివేతలు, దిద్దడాలు చేయవద్దు. నాలుగు ఆప్షన్లలో సరైన ఆప్షన్‌ను నమోదు చేసేటప్పుడు ప్రశ్నపత్రంలో ఆప్షన్‌కు ఉన్న అక్షరాన్ని యథాతథంగా రాయాలి. అంటే ఆప్షనులో ఆంగ్లంలోని చిన్నఅక్షరం ఉంటే చిన్న అక్షరాన్ని పెద్ద అక్షరం ఉంటే అక్షరాన్ని మాత్రమే రాయాలి.

- ఎం. రాజయ్య, స్కూల్ అసిస్టెంట్, హిందీ

ఆంగ్లంలో అక్షర దోషాలు ఉండొద్దు



ఆంగ్లంలో సారాంశాన్ని గ్రహించి సొంతంగా నోట్స్ రాసుకోవాలి. పార్ట్- ఏ, బీ, సీ సెక్షన్లపై అవగాహన పెంచుకోవాలి. అక్షర దోషాలు ఉండొద్దు. ప్రతి ఎనిమిది అక్షర దోషాలకు పావు మార్కు తగ్గిస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత వరకు అక్షరదోషాలు లేకుండా సమాధానాలు రాయాలి. వీటితోపాటు విరామ చిహ్నాల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ వాక్యాలను రాయాలి. గ్రూప్ ఏలో స్టోరీ, నరేషన్, కన్వర్జేషన్, డ్రామా/స్క్రిప్ట్, ఇంటర్వ్యూ, కొరియోగ్రఫీ, గ్రూప్ బీలో బయోస్కెచ్, ఎస్సే లెటర్ రైటింగ్, స్పీచ్, న్యూస్ రిపోర్ట్ ఉంటాయి. మైనర్ డిస్ కోర్సెస్ లోని మెసేజ్, నోటీస్, డైరీ ఎంట్రీలో నుంచి ఒక ప్రశ్న, పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్‌ల నుంచి ఒక ప్రశ్న ఉంటుంది. మేజర్ డిస్ కోర్సెస్, మైనర్ డిస్ కోర్సెస్ బాగా ప్రాక్టీస్ చేయాలి. టెక్ట్ డిపెండెంట్, ఇండిపెండెంట్ అంశాలపై పట్టు సాధించాలి. పద్యభాగంలో ముఖ్యపదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, ఆక్టివ్, పాసివ్ వాయిస్ ప్రాక్టీస్ చేయాలి. రాయడంలో, వ్యాసాలను చదవటంతో పాటు సాధన చేయాలి. పాత పరీక్ష పత్రాలను అవగాహన చేసుకుని పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలి.

-బి.సత్తయ్య, స్కూల్ అసిస్టెంట్, ఆంగ్లం

సాంఘికశాస్త్రం.. అవగాహనే కీలకం



సాంఘిక శాస్త్రం ప్రధానంగా అవగాహనకు సంబంధించిన సబ్జెక్టు. సాంఘిక శాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించాలంటే ఇచ్చిన ప్రశ్నను అర్థం చేసుకొని రాయగలగాలి. ప్రశ్న చాలా రూపాలుగా అడగవచ్చు. ఉదాహరణకు: వివరించండి, కారణాలు తెలపండి, తేడాలు తెలపండి ఇలా వివిధ రకాలుగా ఉండవచ్చు. విద్యార్థులకు భారతదేశం, ప్రపంచపటం, తెలంగాణ పటాలపై పూర్తి అవగాహన ఉండాలి. మ్యాప్ డ్రాయింగ్, మ్యాప్ రీడింగ్ రెండింటిలో అవగాహన ఉండాలి. దత్తాంశ విశ్లేషణ (డాటా అనాలసిస్) ప్రశ్నలు వస్తాయి. ఇచ్చిన డాటాను అర్థం చేసుకొని సమాధానం రాయాలి. జనాభా సమస్య, బాలికల విద్య, పర్యావరణం, కాలుష్యం, యుద్ధాలు, నీరు మొదలైన అంశాలపై నినాదాలు, కరపత్రం తయారీ వంటి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మీద పటాలు, నినాదాలు, కరపత్రం తయారీ, దత్తాంశ విశ్లేషణ(డేటా అనాలసిస్), పేరాగ్రాఫ్ చదివి వ్యాఖ్యానించడం మొదలైన అంశాలతో పాటు పాఠ్యాంశంపై పూర్తి అవగాహన ఉంటే సాంఘికశాస్త్రంలో ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. తేలికైన వాటిని ముందుగా చదివి కఠిన అంశాలను బాగా సాధన చేయాలి. పట నైపుణ్యాలు పెంచుకుని మ్యాప్‌పాయింటింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి, సమాచార నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యానాలు రాయటంపై దృష్టి సారించాలి. పటాలు, పట్టికలు, గ్రాఫ్‌లపై పట్టుంటే ఎక్కువ మార్కులొస్తాయి. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. 'అభ్యాస దీపిక'లోని అంశాలను బాగా చదవాలి.

- వై. రాంగోపాల్ రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు

అప్పుల బాధతో ఆత్మహత్య



కుమార్ (ఫైల్)

కౌడిపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లు కట్టేందుకు చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చనిపోయాడు. ఈ ఘటన మండల పరిధి కంచన్‌పల్లిలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయినికుమార్ (38) కొద్ది రోజుల క్రితం కొత్త ఇల్లు కట్టాడు. ఇందుకోసం సుమారు రూ. 40 లక్షల వరకు అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో అప్పు తీరే మార్గం కనిపించలేదు. దీంతో ఈ నెల 3న ఉదయం ఇంటి స్లాబ్‌పై గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బుధవారం రాత్రి చనిపోయాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి..



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

చిన్నకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రామంచలో గురువారం జరిగింది. ఎస్సై బాలకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీకాంత్‌రెడ్డి (38) ఆర్మీలో పని చేసి, ఐదేళ్ల క్రితం రిటైర్ అయ్యారు. హైదరాబాద్‌లో ఉంటూ పలు వ్యాపారాలు చేయగా, నష్టాలు వచ్చాయి. దీంతో అప్పులు పెరిగి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. బుధవారం హైదరాబాద్ నంచి వచ్చిన శ్రీకాంత్ గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన అప్పులు

బెజ్జంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తన్నపేటలో ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాజె రవి(45) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పిల్లల చదువు, వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పు తీరే మార్గం కనిపించక బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రవికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య గాజె రేణుక గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేయండి

ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



కంది, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ద్వారా పరిశోధనను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో గురువారం ఇండియన్ నేషనల్ యంగ్ అకాడమీ ఆఫ్ సైన్స్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో సైన్స్ కమ్యూనికేషన్ అవుట్ రీచ్ అండ్ పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ (స్కోప్) వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వివిధ జాతీయస్థాయి విద్యాసంస్థల సైన్స్ ప్రొఫెసర్లు, పరిశోధకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన గ్లోబల్ అకడమిక్ ర్యాంకింగ్స్, ఇంటర్ డిసిప్లినరీ సహకారం సరికొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. స్టార్టప్‌లు, స్వదేశీ సాంకేతికత అభివృద్ధి చేస్తూ విద్యార్థుల కేంద్రీకృత విద్యను పెంచడంపై దృష్టిపెట్టాలన్నారు. దేశ స్వావలంబన, శాస్త్రీయ సహకారంతో సోషల్‌మీడియా, విజువల్ స్టోరీ టెల్లింగ్, ఇన్ఫోగ్రాఫిక్స్, ఏఐ టూల్స్ ఉపయోగించడంపై కోర్సు మాడ్యూల్స్‌ను ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. వివరణాత్మక వర్క్‌షాప్‌ల ద్వారా జాయ్ ఆఫ్ రీసెర్చ్ అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అధ్యాపకుల మధ్య స్వతంత్ర పరిశోధన ఆలోచనలను పెంపొందించాలని, విద్యార్థులు, తద్వారా సైన్స్‌లో యువతలో ఉత్సాహం ఉండే వాతావరణాన్ని నిర్మించాలని ఆయన పేర్కొన్నారు.

ఖైదీలకు రుచికరమైన భోజనం పెట్టాలి



కంది, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఖైదీలకు రుచికరమైన భోజనం పెట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ సూచించారు. కందిలోని సెంట్రల్ జైల్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. జైలు ఆవరణ పరిశీలించారు. జైలులో సదుపాయాలను, భోజనం గురించి ఖైలను అడిగి తెలుసుకున్నారు. సమయానికి బెయిల్స్, ములాఖత్‌లు అందుతున్నాయా? అడిగి తెలుసుకున్నారు. న్యాయసేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని చెప్పారు. ఖైదీల భోజనం రుచి చూశారు. ఆవరణలోని పూల మొక్కలు, కూరగాయలతోటను పరిశీలించారు.

బాధిత కుటుంబానికి అండ



మర్కుక్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రమణారావు ఆలోచన రెండు కుటుంబాలకు అండగా నిలిచింది. చందాయిపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్, గొల్లపల్లితండాకు చెందిన రమేష్‌నాయక్‌లు సీఆర్పీలు విధి నిర్వహణలో ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలిసిందే. దీంతో రమణారావు వెంటనే లయన్ ఉత్తమ ఉపాధ్యాయుడు అమర్నాత్‌తో సీఆర్పీలు లచ్చిరామ్‌నాయక్, ఎంఐఎస్ వెంకటేశం, రాయపోల్ సీఆర్పీ యాదగిరి, వివిధ ఉపాధ్యాయ సంఘ నేతలు శశిధర్‌శర్మ, మల్లికార్జున్‌ల సహకారంతో వాట్సాప్‌లో ఫండ్ రేజింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం లక్షా తొంబై వేలు సేకరించి, గురువారం బాధిత కుటుంబాలకు అందించారు. సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి వీరిని అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు(ములుగు) ఉదయభాస్కర్‌రెడ్డి, వెంకట్‌రాములు(మర్కుక్), సత్యనారాయణ రెడ్డి (రాయపోల్)లు, మర్కుక్ మండల పీఆర్టీయూ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు ఉన్నారు.

మిర్చిలో మల్చింగ్

సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



అక్కన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చు ఎక్కువ దిగుబడి సాధించే దిశగా రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు అధునాతన పద్ధతులను పాటిస్తుండగా, కొత్తగా మల్చింగ్ పద్ధతిలో మిర్చిసాగు దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. మొదటిసారి మండలంలోని కుందనావానిపల్లి గ్రామంలో ఓ రైతు మల్చింగ్ పద్ధతిలో మిర్చి సాగు చేస్తున్నాడు. మల్చింగ్ పద్ధతిలో మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమ ఆవిరి కాకుండా నివారించడం వల్ల 30 నుంచి 40 శాతం వరకు నీరు ఆదా అవుతుంది. బిందుసేద్యం పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20 శాతం నీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ జరగక సుమారు 85 శాతం వరకు కలుపును నివారించవచ్చు. మొక్కలకు సూక్ష్మ వాతావరణ పరిస్థితులు ఏర్పడి ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో 20-50శాతం అధిక దిగుబడులు పొందవచ్చు. భూమిలో ఎల్లప్పుడు తేమ నిల్వ ఉండడం వల్ల నేల గుల్లబారి వేరువ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల నీరు, ఎరువులు భూమి లోపల పొరల్లో నుంచి కూడా మొక్కలకు అధికంగా లభ్యమవుతుంది.

జాగ్రత్తలు పాటించాలి..

మల్చింగ్ షీటును బలంగా లాగకూడదు. సాయంత్రం వేళల్లో మాత్రమే షీట్లను అమర్చాలి. ఎండు కుంటే దీనికి సాగే గుణం ఉంటుంది. ఎక్కువ గాలి ఉన్నప్పుడు కూడా మల్చింగ్ వేయరాదు. పంట తర్వాత మల్చింగ్ షీటును పొలం నుంచి తీసివేసి పనులు చేసుకోవాలి. 25 మైక్రాన్ల మందం షీట్లు ఒక పంట కాలానికి, 50-200 మైక్రాన్ల మందం షీట్లు 3 సంవత్సరాల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

మల్చింగ్ వేసే విధానం..

మొక్కలకు ఇరువైపులా లేదా చుట్టూరా 5 సెం.మీ నుంచి 10 సెం.మీ లోతు గాడి చేయాలి. మల్చింగ్ షీట్‌ను కావాల్సిన సైజులో కత్తిరించుకోవాలి. ఈ షీటును ప్రతి వరుసలో లేదా చెట్టు దగ్గర మరీ వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియను యాంకరింగ్ అని అంటారు. దీనివల్ల మాల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

అధికారుల సూచనలతో..



వ్యవసాయ అధికారుల సూచనలతో మొదటిసారి మల్చింగ్ పద్ధతిలో ఎకరంలో మిర్చి పంట సాగు చేస్తున్నా. ఈ పద్ధతి ద్వారా కలుపు, ఎరువుల వాడకం తక్కువగా ఉంటుంది.

-ఏలేటి స్వామి రెడ్డి, రైతు, కుందనవానిపల్లి, అక్కన్నపేట మండలం

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లా అధికారుల ఆదేశాలతో రైతులకు మల్చింగ్ పద్ధతిలో సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పద్ధతితో కూరగాయలు, పూల తోటలు సాగు చేయవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుంది.

-కరంటోతు శ్రీలత, ఏవో, రామవరం క్లస్టర్

సాగునీరు అందించండి..

తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపాలి

మంత్రి ఉత్తమ్‌కు భువనగిరి ఎంపీ వినతి

చేర్యాల/ధూళిమిట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల, ధూళిమిట్ట మండలాల్లోని గ్రామాలకు సాగునీటిని అందించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధి రంగనాయకసాగర్ డీ-10కెనాల్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ-3కెనాల్ పరిధిలోని చేర్యాల మండలం అర్జునపట్ల, కమలాయపల్లి, ఆకునూరు, ధూళిమిట్ట మండలం జాలపల్లి, లింగాపూర్, ధూళ్మిట్ట గ్రామాలకు సాగునీరందించాలని వినతిపత్రంలో కోరారు. దేవాదుల ఫేజ్-3ద్వారా చేపట్టిన రామప్ప-ధర్మసాగర్ టన్నెల్ పనులు పూర్తికావచ్చినందున మోటార్లు ఆన్‌చేయించి జనగామ నియోజకవర్గ పరిధిలోని గండిరామారం, బొమ్మకూరు., వెల్దండ, తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి తద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దేవాదుల ఈఎన్‌సీ, సిద్దిపేట ఈఎన్‌సీ హరిరాం, శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీ వెంట మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, గిరి కొండల్ రెడ్డి, నాయకులు నాగపురి కిరణ్‌కుమార్, సింగపాక కుమార్, కొల్పుల యాదగిరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, కాంగ్రెస్ నేతలు



నెమలిని అటవీ శాఖ సిబ్బందికి అప్పగిస్తున్న రైతు

నెమలిపై కోతుల దాడి

కాపాడిన రైతు అటవీ సిబ్బందికి అప్పగింత

హత్నూర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పొలంలో కోతుల దాడిలో తీవ్రంగా గాయపడి నెమలిని ఓ రైతు కాపాడి, అటవీ శాఖ అధికారులకు అప్పగించాడు. మండల పరిధి దౌలాపూర్‌కు చెందిన చింత వీరేశం వ్యవసాయ క్షేత్రంలో గురువారం ఓ నెమలిపై కోతులు దాడి చేశాయి. మెడ కింద గాయపర్చగా, పొలంలో లేవలేని స్థితిలో పడి పడిపోయింది. కోతుల నుంచి నెమలిని కాపాడిన వీరేశం దానిని దౌల్తాబాద్ పశు వైద్య సిబ్బంది సంగమేష్‌తో ప్రథమ చికిత్స చేయించాడు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది మహేందర్‌కు అప్పగించాడు.

క్రైం కార్నర్

దొంగకు జైలు

వర్గల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో నేరం రుజువైన వ్యక్తికి గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సంవత్సరం జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. గురువారం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అనంతగిరిపల్లిలో గతేడాది అక్టోబర్‌లో చంద్‌ఖాన్‌మక్త గ్రామానికి చెందిన పోయినవైన సుధాకర్ దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ కేసులో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ చేపట్టిన గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రియాంక నేరం రుజువైనందున సుధాకర్‌కు జైలు శిక్ష, జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా చేసిన పీపీ విజయసుధ, గౌరారం ఎస్సై కరుణాకర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను ఉన్నతాధికారులు అభినందించారు.

20 మందికి జరిమానా

చేర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 20మందికి చేర్యాల మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి కృష్ణతేజ గురువారం విచారణ చేపట్టి జరిమానా విధించారు. 15 మందికి రూ.1000 చొప్పున, నలుగురికి రూ.2వేల చొప్పున, ఫోర్‌వీలర్ నడిపిన ఒకరికి రూ.10వేలు జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ధూళిమిట్ట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని జాలపల్లి గ్రామ పరిధి మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఖాతా గ్రామానికి చెందిన సోలిపాక స్వామి, వల్లెపు అనిల్‌కు చెందిన రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం



హుస్నాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం నాగారం గ్రామ శివారులో గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశారు. అలాగే హుస్నాబాద్ పట్టణ శివారులో అక్రమంగా డంపు చేసిన 30 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం..



చిన్నకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : 42 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలంలోని మల్లారం ఎక్స్‌రోడ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే సికింద్లాపూర్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనల్లో సిద్దిపేటకు చెందిన రాజు, సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

సిద్దిపేట క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో పరారీలో ఉన్న నిందితుడిని సిద్దిపేట టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఇర్కోడ్ గ్రామానికి చెందిన మహంకాళి లక్ష్మణ్ అలియాస్ రాజు, ఆసు సుదర్శన్ అనే వ్యక్తితో కలిసి గతంలో పలు బైక్ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇప్పటికే సుదర్శన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, లక్ష్మణ్ తప్పించుకు తిరుగుతున్నాడు. గురువారం మధ్యాహ్నం సిద్దిపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కమాన్ వద్ద ఉన్న లక్ష్మణ్‌ను సిద్దిపేట టూటౌన్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది కనకరాజు, ప్రశాంత్, సుధాకర్ రెడ్డిలతో కలిసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిల్ హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసినదిగా గుర్తించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ స్వాతిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న స్వాతిరెడ్డి

హుస్నాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి మహిళలకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ స్వాతిరెడ్డి అన్నారు. గురువారం ఆమె హుస్నాబాద్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో జరిగిన ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీ లేకపోతే జననం లేదు, స్త్రీ లేకపోతే గమనం లేదు, స్త్రీ లేకపోతే జీవమే లేదన్నారు. మహిళ తల్లిగా లాలిస్తుందని, చెల్లిగా తోడుంటుందని, భార్యగా బాగోగులు చూస్తుందన్నారు. ఎవరో మనకు స్వేచ్ఛ ఇస్తారని ఎదురు చూడకుండా ముందుకు పోవాలని సూచించారు. మహిళలకు న్యాయపరమైన సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సీడీపీవో జయమ్మ, కన్నోజు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతుల కన్నీరు: బీఆర్ఎస్



మల్లన్న చెరువు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

చేర్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలో సస్యశ్యామలమైన తెలంగాణను కాంగ్రెస్ అసమర్థపాలనతో ఎడారిమయమై రైతులు కన్నీరు పెడుతున్నారని కొమురవెల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ముత్యం నర్సింహులు, ఏర్పుల మహేశ్ అన్నారు. మండలకేంద్రంలోని మల్లన్న చెరువును గురువారం వారు పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జనగామ నియోజకవర్గంలోని ఏ చెరువు చూసినా గోదావరి జలాలతో కళకళలాడేవన్నారు. కానీ ప్రస్తుతం చెరువులు, కుంటలు ఎండిపోయి సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. దేవాదుల నుంచి సాగునీరు అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. వెంటనే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి చెరువులకు మళ్లించి సాగునీరందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి కిష్టయ్య, కొండా శ్రీధర్, స్వాములపల్లి కనకాచారి, పోతుగంటి భిక్షపతి, మ్యాకల మల్లేశ్ పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత



పుస్తెమట్టెలు అందజేస్తున్న కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం స్వప్న దంపతులు

సిద్దిపేట క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన కనకయ్య - రాజవ్వ దంపతుల కుమార్తె సుకన్య వివాహానికి సిద్దిపేట మున్సిపల్ 38వ వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం స్వప్న దంపతులు గురువారం పుస్తె, మట్టెలు, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ పేదింటి అమ్మాయి అని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ద్వారా తెలియడంతో తనవంతు సహాయం అందించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ తాజా మాజీ కౌన్సిలర్



జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న తాజా మాజీ కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్

చేర్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్ కాంగ్రెస్‌లో చేరారు. గురువారం చేర్యాలలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు సుద్దాల లక్ష్మణ్, బుట్టి బాగయ్య కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము రవి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, జిల్లా నాయకులు పుర్మ ఆగంరెడ్డి, కర్క సంతోశ్‌రెడ్డి, ముస్త్యాల యాదగిరి, బందిగ రాకేశ్ కృష్ణన్, అందె నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

గజ్వేల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యా శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు పోటీల్లో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుం తెలిపారు. హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు విభాగాలకు చెందిన కళాశాల విద్యార్థులు ఆయా అంశాలపై పరిశోధనలను చేసి సత్తా చాటారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు జిజ్ఞాస సమన్వయకర్త డాక్టర్ అలివేలు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ భవాని, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. అలాగే కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సిద్దిపేట, కళాశాల హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రీధర్, సురవి, కళాశాల హెల్త్ కోఆర్డినేటర్ డాక్టర్ అలివేల పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనుల పరిశీలన



రేబర్తిలో గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు

మద్దూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబర్తి గ్రామంలో నిర్వహించిన పల్లె ప్రగతి పనులను డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. పల్లె ప్రగతి యాప్, గ్రామ పంచాయతీ రికార్డులు, శ్మశాన వాటిక, డంపింగ్ షెడ్డు నిర్వహణ, ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీ సెక్రటరీలు రికార్డుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పల్లె ప్రగతి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్ ఉన్నారు.



చేర్యాల : కొమురవెల్లిలో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ సంబరాలు



సిద్దిపేటలో బీజేపీ నాయకుల సంబరాలు..



గజ్వేల్ పట్టణంలో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

న్యూస్ నెట్‌వర్క్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు గురువారం సంబరాలు చేసుకున్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రం, నారాయణరావుపేట, తొగుట, కొండపాక, జగదేవ్‌పూర్, కుకునూరుపల్లి, వర్గల్, కొమురవెల్లి, ధూళిమిట్ట, దుబ్బాక, మిరుదొడ్డి మండల కేంద్రాల్లో, గజ్వేల్, చేర్యాల తదితర పట్టణాల్లో గ్రామాల్లో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కాంగ్రెస్ అధికార బలంతో ఎన్ని ప్రలోభలకు గురి చేసినా టీచర్స్, పట్టభద్రులు బీజేపీకే పట్టం కట్టారని పలువురు నేతలు ఆనందం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చేర్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో చేర్యాల పట్టణానికి చెందిన మల్లిగారి సుధాకర్‌కు సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. ఆ చెక్కు గురువారం బీఆర్ఎస్ నాయకుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు లబ్ధిదారుడికి అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో గ్రామాలు మౌలిక వసతులకు నోచుకుంటున్నాయని రసూలాబాద్ మాజీ సర్పంచు పచ్చిమడ్ల స్వామి అన్నారు. ఇటీవల మంజూరు చేసిన ఉపాధిహామీ నిధులు రూ.6లక్షల వ్యయంతో రసూలాబాద్ గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ పాలనలో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు.



చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి అన్నారు. గురువారం సిద్దిపేటలో చలో ఢిల్లీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సతీష్, జిల్లా నాయకులు కృపాకర్, ఉపేందర్, అభిలాష్, సంజు తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి దేవాలయానికి విరాళం

గజ్వేల్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజ్ఞాపూర్‌లో నూతనంగా నిర్మించిన త్రిశక్తి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ ఆలయ కమిటీ సభ్యులకు రూ.10,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో మర్కుక్ తాజా మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

● ముస్తాబైన వీరభద్ర స్వామి ఆలయం



చిన్నకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహాగణపతి, శివలింగ, నందీశ్వర సహిత వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు చిన్నకోడూరులోని వీరభద్ర స్వామి ఆలయం ముస్తాబైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే పలు పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇక కొత్త లెక్క..

5వ పేజీ తరువాయి..

దుబ్బాకకు స్థానికేతరుడిగా చెబుతున్నారు. ఇదే అంశంను కొందరు మీనాక్షి నటరాజన్ ముందుకు తీసుకెళ్లారు. స్థానికేతరులకు పదవి ఇస్తే కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

వివాదానికి కూడవెల్లి ఆజ్యం

అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం ఆయ కమిటీ నియామకం చిలికిచిలికి గాలివానలా మారింది. ఆలయం మొదటినుంచి ఆ సమీప గ్రామాల ప్రజలకే పాలక మండలిలో అవకాశమివ్వాలనే డిమాండ్ ఉంది. పాలక మండలి ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు రెండు పర్యాయాలు మాత్రమే స్థానికేతరులకు అప్పగించారు. అయితే ఆలయ కమిటీ చైర్మన్‌గా ఊషయ్యగారి రాజిరెడ్డిపేరును ప్రతిపాదించగానే విమర్శలు వెలువడ్డాయి. ప్రమాణ స్వీకారం సమయంలో ఆయా గ్రామాల ప్రజలు నిరసన తెలిపారు. అదే అంశాన్ని కూడా మీనాక్షి నటరాజన్ ముందు వెల్లడించారు.



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న పూజల హరికృష్ణ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

నంగునూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం నంగునూరు మండలం ఘనపూర్ గ్రామంలో రూ.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామంలో తాగునీటి అవసరాల కోసం బోరు, అంగన్‌వాడీ భవన నిర్మాణం తోపాటు గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తప్పెట శంకర్, పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, ఎల్లం యాదవ్, భాస్కర్, వెంకటరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ముస్త్యాల యాదగిరి, రమేష్, రాగుల కృష్ణ, రాజశేఖర్ రెడ్డి, తిరుపతి, సంజీవ్ పాల్గొన్నారు.

హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం

సిద్దిపేట రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు, రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు హరీశ్‌రావు అని నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి రైతులు అన్నారు. రంగనాయకసాగర్‌లోకి నీళ్లు వదలడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రజినీకర్‌రెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సాగునీటిపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కుంగిపోయిందని, ప్రజాధనం దుర్వినియోగం చేశారని తప్పుడు ప్రచారాలు చేసిన కాంగ్రెస్ నాయకులు నేడు కాళేశ్వరం నీళ్లు రంగనాయకసాగర్‌లోకి తామే తెచ్చామని చెప్పుకోవడం సిగ్గు చేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. శుక్రవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాళేశ్వరంపై అవాస్తవాలను ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతలకు సాగునీటిపై మాట్లాడే అర్హత లేదన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా కమలాయపల్లి, అర్జున్‌పట్ల, ఆకునూరు, జాలపల్లి గ్రామాలకు డి3 కాలువ ద్వారా సాగునీరు అందించాలన్నారు. రంగనాయకసాగర్ నీటిని మద్దూరు మండలంలోని గ్రామాలకు మళ్లించే ప్రయత్నాలు కాంగ్రెస్ నాయకులు విరమించుకోవాలన్నారు. అవసరమైతే తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి మద్దూరు మండలంలోని గ్రామాలకు సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, సీనియర్ నాయకులు మల్లయ్య, బద్దిపడగ కిష్టారెడ్డి, రాజిరెడ్డి, పురేందర్, మహేందర్ గౌడ్, నాగేందర్, ఉల్లి మల్లయ్య, ఆబిద్, సతీష్‌గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీలపై చర్యలు తీసుకోవాలి

● పోలీసులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



అక్బర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిరుదొడ్డి, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలు బండి సంజయ్, అరవింద్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కమలాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అక్బర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ అండ్ టీం అంటూ ఎంపీ బండి సంజయ్ విద్వేశాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, ఆయనను కేంద్రమంత్రిగా బర్తరఫ్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ ఎంపీలను గ్రామాలకు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్, మహిపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరానగర్' విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షలో సిద్దిపేట ప్రభుత్వ ఇందిరానగర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ధ్యేయ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన ఈ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులకు లాప్ టాప్ ఇవ్వడంతోపాటు భవిష్యత్తులో అన్ని పోటీ పరీక్షలకు ఉచితంగా ఆన్‌లైన్ క్లాసులు ఇవ్వనున్నారు. కాగా, ఇందిరానగర్ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 విద్యా సంవత్సరానికి గానూ అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ తెలిపారు. ఎకనామిక్స్ సబ్జెక్టు అధ్యాపకుడి పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలైతే ఎంఏ ఎకనామిక్స్‌లో 50శాతం, మిగతావారు 55శాతం మార్కులతో పాసై ఉండాలని తెలిపారు. ఈ నెల 10లోగా దరఖాస్తులు సమర్పించి 11న ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.